# రెండు కన్నీటి బొట్లు

రెండు కన్నీటి బొట్లు బావిలో పడ్డాయి.

బావి చప్టా మీద నిలబడి, అడ్డగోడకానుకొని, గిలక పట్టుకొని, బావిలోకి తొంగి చూస్తున్న మాతమ్మ కళ్ళలో నీళ్ళుబికి, పుట్టినిల్లంతా ఉద్రేకంగా కలదిరిగి, కాళ్లొచ్చిన పిల్లల్లాగా ఇల్లు వదిలి వెలుపలికి వచ్చి, ముక్కు రెండు పక్కలా కాపలా పోలీసుల్లాగా నెమ్మదిగా జారి, చూరు పట్టుకొని వేళ్ళాడే పిల్లల్లా ఉయ్యాల జంపాలలూగి, ఆఊపులో బావిలోకి దూకాయి రెండు కన్నీటి బొట్లు.

మాతమ్మ ముక్కు తుడుచుకొంది. కళ్ళు తుడుచుకొంది. అయినా చూపు మసకగానే ఉంది. కళ్లు చికిలించింది. మళ్ళీ మళ్ళీ ముక్కు తుడుచుకొంది. ఏమీ కనిపించలేదు.

తాగటానికి నీళ్ళిచ్చే బావి రెండు కన్నీటిబొట్లు చప్పరించి నోరు మూసుకొంది. కళ్ళలో ఊరిన నీళ్లు తాగునీటి బావి లోపలికి పోయాయి. ఆ నీరు పైకి వస్తుంది. ఈ నీరు కిందికి పోయింది. రెండూ నీళ్ళే! అది బావి నీరు. ఇది కన్నీరు.

చప్టా మీది మాతమ్మ దూరంగా ముక్కు చీది, చీపురు తీసుకొని, గుడిసెలోకి పోయింది. అంతకు ముందే బావి చుట్టూ శుభ్రంగా ఊడ్చింది. ఇంకా సూర్యోదయం కాలేదు. మసక వెలుతురు. పనీ పాటా లేని నెలలు, పల్లెంతా మెల్లగా నిద్ర మేల్కొంటుంది.

వాకిలికి ఒక పక్క చీపురు ఆనించి, మరో పక్క గోడకు వీపు మోటించి, ఆమె చీపురు కట్టలాగా కూర్చుంది. ఇల్లు ఊడ్చలేదు. వాకిలి వేయలేదు. కాళ్ళారజాపుకొని కూర్చుంది.

డబ్బు పారేసుకొన్న మనిషి పడి ఉంటాయని అనుకొన్న చోట్లన్నీ వెతికినట్లు, బావిని కూర్చున్న చోట నుంచే తదేకదృష్టితో చూస్తూ ఉండింది మాతమ్మ. బావినే చూస్తున్న ఆమెకు



బావి కనిపించటం లేదు. బావి మీదగా, చాలా దూరంగా చాలా కాలం కిందట, మూడేళ్ళ నాడు చప్టా మీద పడి, తానేడ్చిన ఏడ్పే - ఆ గోలే, ఆ గొడవే, కళ్ళలో నీళ్ళయి తిరుగుతూ ఉండి, ఒక్క కడవ నీళ్ళు కావాలంటే, బావి దగ్గరకు రావాలి, కడవ తేవాలి. తాడు తేవాలి. గిలక మీద వేయాలి. తాడు కడవకు ఉచ్చు వేయాలి. బావిలోకి వేయాలి. నీళ్ల ముంచాలి. పైకి లాగాలి, ఉచ్చు తీసి కడవొక చేత్తో, తాడొక చేత్తో తీసుకుపోవాలి. ఒక్క కడవ నీళ్ళ కోసం ఇంత తతంగం. మాతమ్మ కళ్ళు ఆమె మౌనంగా కూర్చుంటే జలలే! నీళ్ళు ఊరుతూనే వుంటాయి, కడవలేం కర్మ కుండలూ, బానలే నిండుతాయి. పడితే, కళ్ళకీ ముక్కుకీ ఏం సంబంధమో ఏడ్చినప్పుడు రెండూ తుడుచుకోవాలి. ఆమె తుడుచుకొంది.

గిలక చప్పుడుకు ఉలిక్కిపడింది. నీళ్ళు తీసుకుపోతున్న వాళ్ళను చూస్తూ ఉంది.

పల్లెలోకి పోయే నీళ్ళలో తన కన్నీళ్ళున్నాయి. వాళ్ళు ఆ నీళ్లే తాగుతారు. కన్నీళ్ళు కలిపిన నీళ్ళు! ఇంత కాలం, సంవత్సరంనుంచి, వాళ్ళు ఈ నీళ్ళే తాగుతున్నారు. ఈ బొట్లు విషం బొట్లా? ఏమో తెలియదు. ఎవరూ చనిపోలేదు. చనిపోయిన వాళ్ళెవరూ బ్రతకలేదు. ఈ కన్నీరు అమృతం కాదు.

'మాతే! ఏం జేత్తన్నా!'

మేనత్త, అత్తకూడా పలకరించిన తీరుకి ఉలిక్కిపడ్డ కోడలు బదులు పలకలేదు కానీ, ఆరదోలిన కాళ్ళు దగ్గరకు లాక్కొని తన కాళ్ళ మీద తన అధికారం నిలుపుకొంది.

మాతమ్మ అత్తకు బదులు చెప్పలేదు. ఆమె సమాధానం కోసం చూడలేదు. మాతమ్మకు బదులు చెప్పకూడని కోపం లేదు. దుఃఖం లేదు, అది పలకరింపు, ప్రశ్న కాదు, ఈమె కాళ్ళు కదపటమే జవాబు. నోరక్కరలేదు.

అత్త నీళ్ళు తోడుకొని వెళ్ళిపోయింది.

మాతమ్మ రోజంతా గోడకు వీపు మోటించి కూర్చుని ఉంటోంది ఏడుస్తూ. నిద్రపోతుందో పోదో తెలియదు. ఆమె పని అంతా బావిని చూస్తూ కూర్చుండటమే.

బావిని ఊడుస్తున్నప్పుడే చలనం! పొద్దునొక సారి. మాపటేలొకసారి. అంతే! మరో దశలో ఆమెనెవరూ చూచి ఉండరు.

పదేళ్ళ వాడు పక్కూరి తమ్ముడి కూతుర్ని అత్త తీసుకొచ్చి కొడుకుకు చేసుకొంటే కొత్త పెళ్ళికూతురులా ఆ ఊరు వచ్చింది మాతమ్మ. ఆ రోజుల్లో మాతమ్మ కాలు నిలిచేది కాదు. కాలుగాలిన పిల్లిలా తిరిగేది. అగమ్మ కాకిలా ఎగిరేది. ఇప్పుడా చలనమే లేదు. కదలికే లేదు. ఉత్సాహమే లేదు.

అంతా శూన్యం! ఎంత మార్పు!

ఆగని మనిషి ఆగిపోయింది. తిరిగే మనిషి ఆగిపోయింది. ఎగిరేది కూలబడింది. చైతన్యం స్తబ్ధమైపోయింది. ఈ బ్రతికి ఉన్న మనిషి బతికి లేదు. మాతమ్మను లెమ్మనే వాళ్లు లేరు. రమ్మనే వాళ్ళు లేరు. ఒంటరిది. ఆమెకు పని చెప్పే వాళ్ళు లేరు. చేయించుకొనే వాళ్ళు లేరు. పని లేదు. తనొక్కతే! ఏకాకి. ఏకోనారాయణ! ఏం వండుకొంటుందో తింటుందో ఏమో!

ఆమెకు తింటానికుంది. ఉంటానికీ ఉంది. ఎవరి కోసం తింటుంది? ఉంటుంది?

ఎవరి ప్రేమా లేదు. ఎవరి మీదా ప్రేమ లేదు. తన మీద తనకే ప్రేమ లేదు. అసలు ప్రేమే లేదు.

ఇప్పుడిలా ఉంది కానీ, మూడేళ్ళ క్రితం దాకా మాతమ్మ గలగలలాడుతూ ఉండేది. వండుతూ వారుస్తూ వడ్డిస్తూ కనబడేది. ఇల్లలుకుతూ ముగ్గులు పెడుతూ ఉండేది. నీళ్ళు తోడుతూ కల్లాపిజల్లుతూ కనిపించేది. కాలు నిలిచేది కాదు. కళకళలాడుతూ గలగలలాడుతూ పరుగులు తీస్తూ ఉండేది. ఆ ఉత్సాహం లేదు. ఆ ఉరుకులు పరుగులు కూడా లేవు. 'కూరగాయలు' మగమనిషి గుడిసెలోకి పోయాడు. పై పంచలోనివి మూలకు పోశాడు.

'రేత్రికి వణ్ణం ఈడే దింటా' వెళ్ళిపోయాడు.

అతను రావటం ఆమె చూడలేదు. పోవటమూ చూళ్ళేదు. మాట మాత్రం వింది. అయినా కదల్లేదు.

అతనే శ్రీరామచంద్రుడంటే, అందరూ రావడంటాడు.

రాముడు రావటానికి అనుమతి అడగలేదు. పోవటానికీ లేదు. వచ్చాడు హక్కుదారుడు. ఇంట్లోకి వచ్చాడు. పరాయివాడు పోయినట్లు వెళ్ళిపోయాడు. రాముడి రెండు మాటలు ఆమె విన్నా బదులు చెప్పలేదు. అతను వినలేదు, ఆగలేదు. వెళ్ళిపోయాడు.

వచ్చినవాడు, వచ్చినట్టే వెళ్ళాడు

కూచున్నామె కూచున్నట్లే ఉంది.

కూరగాయలు ఇంటికి చేరాయి.

మేనత్తకు ఒక్కగానొక్క కొడుకు రాముడు. ఇంత ఎత్తు, ఇంత లావు, ఇంత ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషిని చూచి, పదేళ్ళ కిందటే, అప్పడే తాటాకు సింహాసనం దిగి పసుపు స్నానం చేసి చీర కట్టుకొన్న మాతమ్మ మనస్సు పడింది, పారేసుకొంది.

అత్త వచ్చి తమ్ముడి పెళ్ళి మాటెత్తితే, లోపలున్న మాతమ్మ తండ్రి కంటె ముందు, తానే మనస్సులో 'ఊ' అనుకొంది. అనుకొన్నదే తడవు, అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి.

అత్తా మామలు కనీ పెంచే వయస్సులో ఉండటం వల్ల మాతమ్మ కాపరానికి వచ్చిన మొదటి రోజుల్లోనే ఊరబావి దగ్గర కొత్త ఇల్లు కట్టించి ఇచ్చి వేరు కాపురం పెట్టించారు. అత్తింటివాళ్ళు దాన్ని ఇల్లు అన్నారు కానీ, పుట్టింటి వాళ్ళు మాత్రం గుడిసె అన్నారు. మాతమ్మ మాత్రం దాన్ని ఏడు అంతస్తుల మహారాజు మేడ అనుకొంది. అందులో తాను మహారాణీ,

భర్త మహారాజు అనుకొంది. అలాగ్గే జీవించింది.

గోడకానుక్కూర్చున్న మాతమ్మ బావి పక్కకు చూస్తూ ఉంది నాలుగ్గిలకలూ విరామం లేకుండా మోగుతున్నాయి. మోత బాగుంది. సంగీతంలా ఉంది. క్రమం తప్పకుండా ధ్వని, ఆమెకు వినే ఓపికాలేదు. సంగీతం విని సంతోషించే ఇష్టమూ లేదు.

వచ్చే వాళ్ళు వస్తున్నారు. పోయే వాళ్ళు పోతున్నారు. ఎంత తోడినా బావిలో నీళ్ళు తగ్గటం లేదు. ఆమె కళ్ళలో నీళ్ళులాగా.

బావిలో ఎప్పుడూ మూడు నిలువుల లోతు ఉంటుంది. ఎండా కాలంలో కూడా నీళ్ళు తగ్గవు. ఎన్ని నీళ్ళు తోడినా, నీళ్ళు అక్కడే ఆ మెట్టు మీదే ఉంటాయి.

బావిలో పడ్డ రాగి బిందెలు. ఇత్తడి కడవలు, కంచుపాత్రలు, మట్టి కుండీలు, తాళ్ళు ఏవైనా తీయాలంటే దిగక తప్పదు. దిగినా వానాకాలమయితే తీయలేరు. ఎండాకాలమయినా పాతాళభైరి లాంటి మనిషి అయితే తప్ప చిల్లపెంకు కూడా తేలేడు. లోతెక్కువ, వెడల్పు ఎక్కువ. ఏంబావి అది! చెయ్యంత జల! ఒకే మట్టం. ఎప్పుడూ అంతే, పాతాళగంగ.

ఆ బావి నీళ్ళు చాలా రుచి. టెంకాయ నీళ్ళు! చల్లగా హాయిగా, తియ్యగా ఉంటాయి.

ఆమెకు అత్తింటి నీరు వంటబట్టింది. ఆరోగ్యం బాగుంది. భర్త ప్రేమ వల్లమాలినంత ఇష్టంగా ఉంది. భర్త దగ్గర ఆమె కరిగిపోతుంది. తల నిమిరితే చాలు పరవశమే!

ఈ ఏడే నీళ్ళు పోసుకొంది

కడుపులో బిడ్డ పెరుగుతుంది. తానే పెరుగుతున్నట్లు తన్మయత్వం చెందేది మాతమ్మ. ఊదకుండా ఉబ్బే రబ్బరు బుడగ అనుకొనేది. మళ్ళీ మళ్ళీ తడిమి చూసుకొనేది. కడుపులో బిడ్డ కదులుతుంటే సృష్టి కార్యం సమస్తం తన హక్కూ అయినట్లు పొంగిపోయేది. పాలల్లో చెక్కరలా కడుపులో బిడ్డ తిరుగుతుంటే తీయగా ఉండేది. కడుపులో దూకటం, నడవటం, పడటం, పారాడటం, పరుగెత్తటం ఊహించుకొనేది. పెళ్ళయినప్పుడు వీపుకు అతుక్కొన్న పొట్ట. ఆ ఏడాదికే అంత నిండుగా కావటం ఆమెకు అశ్చర్యం. పొట్టలో బిడ్డ పడటం, పెరగటం ప్రాణం పోసుకోవటం ఆమెకు చాలా అద్భుతంగా ఉంది. విచిత్రంగా ఉంది. నమ్మశక్యంగా ఉంది. తన పొట్ట తన అనుమతి లేకుండా అలా తందాన తానాలాడటం భర్తతో చెప్పి మురిసిపోయేది.

నెలలు నిండుతున్న కొద్దీ చెప్పరాని భయం. భర్త ప్రేమ, అత్త ఆదరణ, మామ పోషణ, అమ్మా నాన్నల రాకపోకల ఆప్యాయత, భయాన్ని బందిఖానాకు తోలేవి.

పురిటికి పుట్టింటికి వచ్చినప్పుడు, పుట్టీ పెరిగిన చోటు చూచుకొని ఆనందం. అప్పుడు పెళ్ళికానిది. ఇప్పుడు ఇల్లాలు. అప్పుడు పొట్ట ఖాళీ. ఇప్పుడు నిండుకుండ!

ఎప్పుడూ దగ్గరుండే భర్త తన పుట్టింట్లో లేడు. అక్కడే ఉండిపోయాడు. తాను ఒంటరి.తాను జంట. తన బిడ్డ తనకు తోడు. భర్త లేడు దగ్గర. బిడ్డ ఉంది తనలో. తను ఉన్నాడు తనలో, తన చుట్టూ, తనంతట తానే ఉన్నాడు. అటు దుఃఖం, ఇటు సంతోషం రెండు కలగలిపి జీవితం అర్థమయీ, కానట్లుగా ఉండటం ఆమెకు ఆశ్చర్యంగా ఉంది.

పుట్టింట్లో పురుడు పోసుకొన్న మాతమ్మ పండంటి పసివాణ్ణి పక్కలో వేసుకొంది. పసివాడు బాగున్నాడు. ఆమె ఆరోగ్యం బాగుంది. తనేనా వీణ్ణి కంది అనుకొని, చూచి, ఆశ్చర్యపోతుంది. మాతమ్మ ఆరోగ్యం చెక్కుచెదరలేదు. ఇనపగుండులాగా ఉంది.

భార్య కానుపు అయిందని తెలిసి వచ్చిన భర్త బాబునూ, ఆమెను చూచి ముచ్చటపడ్డాడు. అచ్చటా ముచ్చటా తీర్చాడు. ఆడపిల్ల అయితే బాగుండేది అన్నాడు. అయినా ఆనందంగానే ఉన్నాడు. అంత ఆనందంలోనూ ఆమాట మాతమ్మను గిల్లింది. గిచ్చింది. పొడిచింది. పోట్లాడింది. దిగులు కలిగించింది.

'ఈసారి' అంది. రాముడు చూశాడు. నవ్వాడు.'వెళదామా' అంది. సరేనన్నాడు. వాళ్ళు సిద్ధమవుతుంటే అత్తింటి వాళ్ళు, పుట్టింటివాళ్ళు వారించారు.

'బావా' అంది మేనత్త కొడుకును.

'ఏమ్మా?' అన్నాడు.

'నీ కొడుకు నీకు మల్లే ముచ్చోడు' అంది

కాదు అనుకొంది మాతమ్మ. 'కాదు' అనేసింది. అత్త వింది. పకపక నవ్వింది. పసివాడికి ఏమో అర్థమయినట్లు, బోసి నవ్వు,పళ్ళు లేని నవ్వు బొర్రి ముఖంతో నవ్వుతున్నాడు.

ఆ ఏడు పంటలు బాగా పండాయి. ఇల్లంతా కళకళలాడింది. అంతా కన్నుల పండుగ్గా ఉంది. కానీ మాతమ్మ మనసే కలత చెందింది. ఆడపిల్ల అయితేనే బాగుండేది అనుకొంది అంది భర్త విన్నాడు. ఊరుకొన్నాడు వారించనూ లేదు. అనునయించనూ లేదు.

అత్త అనునయించింది. ఏందా.కూచోటం 'లే' అంది. 'లేచి మొకం కడుక్కో' అంది.

మాతమ్మ కుదురుగా కూర్చుంది. 'లేస్తావా లేదా' అంది. తొట్లో నీళ్ళు పోసింది. 'నిన్నే' అంది. ఇంట్లో బిందె దించింది. మాతమ్మ తలూపింది. అత్త చేయి పట్టుకొంటే లేచింది. పిడక్కచ్చిక ఇస్తే పళ్ళు తోముకొంది. దళ్ళోకి తీసుకుపోతే తానే స్నానం చేసింది. చీర ఇస్తే మార్చుకొంది. విడిచిన చీర తడిపెట్టింది. అత్త ఇల్లు ఊడ్చింది. సర్దింది. తలుపులు వేసింది. వెళ్ళిపోయింది.

మాతమ్మ గుడిసెలోకి పోయింది కడుపులో దేవినట్లయింది. నట్టింట్లో చాపమీద చతికిలబడ్డ బావివైపు చూస్తూ ఉంది. బావి ధనవంతుడి ప్రాసాదంలాగా ఉంది. సంపదలాగా ఉంది.తనని తాను దానం చేసుకొనే శిబి చక్రవర్తి శరీరంలాగా వుంది. బావిదెంత త్యాగం. అకారణ త్యాగం.

బావిని తలచుకొంటుంటే ఊరంతా కళ్ళ ముందు సాగింది. గతమంతా కళ్ళ ముందు తిరుగుతూ ఉంది.

రెండో కానుపుకు పుట్టింటికి పోతే అత్తామామల మీద వదిలేసి ఊరుకోక, భర్త తనతోనే వచ్చి, తనతో ఉండి తన వాళ్ళమా అస్తారుబస్తంగా చూడటంతో ఆమె వెన్నెముక జవజవలాడింది.

రెండో కాన్పు సమయంలో భర్త ఇంట్లోనే ఉన్నాడు. ఏం కావాలన్నా తెచ్చాడు. మంత్రసానిని సైకిలు మీద తీసుకువచ్చాడు. ఇల్లంతా అల్లరల్లరి ఆగమాగం చేసి పెట్టాడు. ఆమె తన పురుటినొప్పుల్ని కడుపులోనే దాచుకొంది. భర్త లేని నొప్పుల్ని, రాని నొప్పుల్ని వాళ్ళంతా తెచ్చుకొన్నాడు.

ఆ రోజు తెల్లవారుజామున మాతమ్మ తల్లిని లేపింది. ఇంకా చీకటి ఉండగానే ఇల్లంతా తెల్లవారిపోయింది. అమ్మా నాన్న ఉన్నారు. అత్తా మామా ఉన్నారు. భర్తా కొడుకూ ఉన్నారు. ' చనిపోతానేమో' అనుకొంది. నలుగురితో తన బాధ వెళ్ళగక్కుకొంది. భర్తతో ' సస్తానేవో' అంది. 'సావ్వు' అని భరోసా ఇచ్చాడు. ఆ మాటే ఎంతో ఓదార్పుగా అనిపించింది.

పురుటినొప్పులే కష్టం గానీ, కాన్పు సుఖంగానే అయింది. నెత్తి మీద కొండ దించినట్లు అయింది. గోదాలో కుస్తీ పట్టి అలిసిపోయిన వస్తాదులాగా పడుకొంది మాతమ్మ.

భర్త చిందులూ శివాలూ చూచి ఆడపిల్లే పుట్టిందని గ్రహించింది. పక్కలో పసిదాన్ని చూస్తే భర్తనే చూచినట్లుంది. తలనిమురుతున్న భర్తను కన్నీళ్ళతో చూచింది. అంది. 'ఔనే'నన్నాడు రాముడు. ఏమన్నాడో తెలియదు. కాలు నిలవకుండా తిరుగుతున్నాడు.

ఆమె ఎంతో కాలం పుట్టింట్లో ఉండలేదు. కాస్త తిరగటం మొదలు పెట్టేసరికి

ప్రయాణమై కూర్చుంది. రాముడు సరేసరి. చెప్పులు తొడుక్కునే ఉన్నాడు. భర్తతో అత్తింటికి రావటం ఎందుకో చాలా ఆనందంగా అనిపించింది. తన గుడిసే తనకు స్వర్గం.

పాపకు బొట్టు పెట్టటం, కాటుక పెట్టటం, మాతమ్మకు మహాసరదాగా ఉండేది. స్నానం చేయించటం, తల దువ్వడం, గౌను తొడగడం, ఎంతో ఉత్సాహంగా ఉండేది. పిలకల్ని జడలంటూ దువ్వటం ముచ్చటగా ఉండేది. పిల్లవాడి పని కంటే పసి దాని అంతా తనకు తెలిసినట్లుండేది. వాడు చుట్టుకుచుట్టుకు తిరుగుతుంటే ఆమెకు ప్రాణం లేచి వచ్చేది.

పిల్లలిద్దరినీ తన పక్కలో చెరో పక్క వేసుకొని పడుకొనేది. భర్త దిక్కున్న చోట పడుకొనే వాడు. ఇప్పుడు రాముడి పని అన్యాయమైపోయింది. బాబు పుట్టినప్పుడు మాతమ్మకు ఒక పక్క తాను పడుకొనే వాడు. పాప పుట్టేసరికి వాళ్ళు రెండు పక్కలా చేరిపోయారు.

ఇద్దరు పిల్లలు కలిగేసరికి మాతమ్మకు మొగుడియావ తగ్గిందని అత్తా మామా అనుకోవటమే కాదు. అమ్మా నాన్న మందలించారు.

పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళు కావాలని, బాగా చదువుకోవాలని, గొప్ప ఉద్యోగాలు చేయాలని, పది మంది తమ పిల్లల దగ్గర చేతులు కట్టుకొని నిలబడాలని కలలు కనేది.

వాళ్ళకు పెళ్ళిళ్ళయి పిల్లలు కలిగితే, వాళ్ళ దగ్గరే తానుండిపోవాలని, వాళ్ళ పిల్లల్ని పెంచాలని, ఎప్పుడూ పిల్లల్ని పెంచుతూ ఉండాలని కోరుకునేది. ముక్కూ మూతి తుడుచుకోవటం రాని వాళ్ళను గూర్చి అందమయిన కలలు కనేది.

వాళ్ళు స్కూళ్ళకు పోవటం అతి రమ్యమైన ఆలోచన. స్కూలు సంచులు, డ్రెస్సులు, బూట్లు, పుస్తకాలు, పలకలు, బలపాలు ఎంతో ఇష్టంగా ఉండేవి. వాళ్ళు అన్నం పెట్టమని అడగాలి. మారాం చేయాలి. లెమ్మన్నా లేవకుండా నిద్రపోవాలి. మేల్కొంటే తన వెంటే తిరుగుతూ ఉండాలి. తన పక్కలోనే పడుకోవాలి.

వాళ్ళకు అక్కరలేకపోయినా, స్నానం చేయించేది. బట్టలు మార్చేది. వద్దన్నా వినిపించుకోకుండా అన్నం పెట్టేది. తినకపోతే తిట్టేది. కొట్టేది.

ఆమె ప్రేమను తిని, గువ్వలాంటి పిల్లలు గునపాలు లాగా తయారయ్యారు. ఆరోగ్యంగా అందంగా చూడముచ్చటగా బొమ్మల్లా తయారయ్యారు. వాళ్ళను చూచుకొంటూ కూర్చోవటం ఆమెకెంతో ఇష్టం.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు కావటం, వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయటం, పెళ్ళయి ఆడపిల్ల

వెళ్ళిపోవటం తలచుకొని ఏడ్చేది. అడ్డాలనాడు బిడ్డలు గాని, గడ్డాలనాడు బిడ్డలా అని వేరుపడిపోతున్న కొడుకును ఊహించుకొని దుఃఖించేది.

పిల్లలిద్దరూ తల్లి చాటు పిల్లలుగా, ఆమె పైట కొంగుకేసుకొన్న ముడులుగా పెరిగి పెద్దవాళ్ళు కావటం ఆమెకెంతో తృప్తిని, ఆనందాన్ని కలిగించసాగింది. 'అందరూ పిల్లల్ని గంటారు నువొక్కదానివేం గాదు' అని కొందరు ఆమెను ఎగతాళి చేయకపోలేదు.

అదేం చిత్రమోగానీ, మాతమ్మకు మళ్ళీ పిల్లలు కలగలేదు. అదీ ఒక మేలే అయింది. పిల్లలిద్దరినీ వదలకుండా, బంక వేసి అతికించుకొన్నట్లు తిరిగేది. పెద్దగా పనీ పాటా పట్టించుకొనేది కాదు. వీలయినంత వరకు ఇంటి పట్టునే ఉండేది. పొలం పోతే పిల్లల్ని వెంటేసుకొని పోయేది. ఎండలో వాళ్ళు మాడినా ఆమె కిష్టమే గానీ, వాళ్ళు తనతో, తన వెంట, తన కంట, తన చుట్టూ ఉండాలని విపరీతంగా ఇష్టం.

'ఇది సచ్చినా ఆళ్ళనొదిలి సావదు' అనుకొన్నాడు రాముడు. అందుకే ఏమీ అనే వాడు కాదు. సర్దుకు పోసాగాడు. అత్తామామలు కూడా మాతమ్మ ఇష్టాన్ని కాదనలేదు.

పాపకు మూడేళ్ళు, బాబుకు ఐదేళ్ళు, పెళ్ళయి ఏడేళ్ళు మాతమ్మకు ఇరవై మూడేళ్ళు. మూడేళ్ళ కిందట అనర్థం జరిగింది. అనర్థం జరిగిందాకా తెలియలేదు. తెలిసేసరికి చేతులు కాలాయి. ఆకులు కాలాయి. ఇల్లు గుండమయింది బతుకు బూడిదయింది.

'యావయిందే!' రాముడు వస్తూ సూర్యుణ్ణి నడినెత్తిమీద మోసుకొచ్చాడు.

మాతమ్మ వళ్ళు మండుతూ ఉంది.

'యాందయ్యా?'

'మల్లిపూలు!'

'యెవురికి?'

'నీకే!'

'నాకా?' నోరు తెరిచి మూసుకోవటం మర్చిపోయింది. రాముడు అక్కడ నిలవలేదు. వెనుదిరిగాడు. వెళ్ళిపోయాడు. కళ్ళు మూసి తెరిచినంత పని. వచ్చినట్లే వచ్చాడు. వచ్చినట్లే వెళ్ళిపోయాడు. ఈ లోపల ఏదో చెప్పాడు. ఏదో ఇచ్చాడు. అది జ్ఞాపకంలా అయిపోయింది. మల్లెపూల వాసన మర్చిపోలేదు. వాసన వెదజల్లుతున్నాయి భర్త వచ్చి వెళ్ళినట్లు మల్లేపూలే సాక్ష్యం.

భర్త రాత్రికి వస్తాడని,తను అన్నం వండి వడ్డించాలని, మల్లెపూల చెండు తలలో పెట్టుకోవాలని, తడిక తలుపు సగం వేసిన అతని కోసం ఎదురు చూడాలి కాబోలు అనుకొంటుంటే వెన్నెముక సలపరం పుట్టసాగింది. నడినెత్తి సూర్యుడు చురచురలాడుతున్నాడు. మండిపడింది మాతమ్మ.

మాతమ్మ లేచింది. లేచిన మనిషి నిలబడింది. నిలబడ్డ మనిషి నడిచింది. నడిచిన మనిషి ఆపనీ, చేయసాగింది. పొయ్యి రాజుకొంది . వంట్లో చలనం, ఇంట్లో కదలిక వచ్చాయి.

ఉన్నట్టుండి మాతమ్మ బైటకు వచ్చింది. ఊరబావిని చూచింది. ఆ ఊళ్ళో పుట్టి పెరిగి పోయిన వాళ్ళ చరిత్ర గుండెల్లో నిలుపుకొన్న తరతరాల చరిత్ర శిథిల శాసనంలాగా బావి కనబడుతూ ఉంది, అది ఎంత కాలం నుంచి ఉందో, ఎన్ని తరాల వాళ్ళు నీళ్ళు తోడుకున్నారో, ఎందరికి జలదానం చేసిందో, ఎందరు తాగి జీవించారో, ఏమీ యాచించని త్యాగం. బావి గతంలాగానే కాదు, భవిష్యత్తులాగా కదలాడసాగింది.

భర్త భోగం పిల్లను వెంటేసుకొని తిరుగుతున్నాడని, దానికి ఇల్లు కూడా కట్టించాడని, దానితోనే ఉంటున్నాడని తెలుసుకొన్న మాతమ్మ మొదలునరికిన చెట్టులా కూలిపోయింది.

రాత్రిళ్ళు తను తన పిల్లలతో పడుకొంటే ఇల్లు వదిలి వెళుతూ ఉండే భర్త, తల్లిదండ్రుల దగ్గరున్నాడుకొంది కానీ, భోగం దాని వళ్ళో తలపెట్టుకొని పడుకొన్నాడని అనుకోలేదు.

భోగం పిల్లకు కన్నెరికం పెట్టాడని, ఇక ఆ అమ్మాయికి రాముడే భర్తని, తెలిసి భోరున ఏడ్చింది. ఆ అమ్మాయి అందంగా ఉంటుందని, ఆడుతుందని, పాడుతుందని, రాముడామెను వదిలి రావటం లేదని, ఇల్లు, పశువులు, వ్యవసాయం, పొలం, పంటలు అన్నీ వదులుకొన్నాడనీ, తెలిసి ఆశ్చర్యపోయింది.

'నీ రొండో పెళ్ళాం యేట్టోగలవా, నీ పొలం తగలబెట్టుకొంటావంటారా' అని తల్లిదండ్రులు నానా గడ్డీ పెడితే, నెమ్మదిగా పొలం పనులూ, ఇంటి పనులు చూచుకోసాగాడు కానీ, రెండో దాన్ని మాత్రం వదలలేదు, అమ్మా నాన్నలతో సర్దుబాటు అయింది. అప్పుడప్పుడూ మాతమ్మను కూడా మాట్లాడించి పోతున్నాడు.

'కోడలు మణిసేరా, మానుగాదు. సీమూ నెత్తురున్న మణిసేరా. ఉప్పూ కారవే తింటున్న వాళ్ళే!' అని అమ్మా నాన్న హెచ్చరిస్తే.'అదొక మొద్దు దానికెందుకు మొగుడు!' అని చిందుల్దొక్కేడు.

ఎప్పుడయినా రాత్రిపూట వస్తాడు. భార్య చేతికూడు తింటాడు. వస్తూ మల్లెపూలు తెస్తాడు. రాత్రంతా ఆమెతోనే ఉంటాడు. పిల్లల్నీ బాగానే చూచుకొంటాడు. కావలసినవన్నీ కొనిపెడతాడు.

భోగం పిల్లను వదిలేయమని ఆమె వేడుకొంది. కాళ్ళా గడ్డం పట్టుకొంది. వీల్లేదన్నాడు. దాన్ని చంపుతానంది. చావండి అన్నాడు  నిన్ను చంపుతానంది. నీ చేత కాదన్నాడు. భోరున ఏడ్చింది.

అత్త వచ్చింది. వస్తూ కూర దెచ్చింది. 'కూడొండుకున్నా?' అడిగింది. 'ఊ' అంది. 'కూరదెచ్చా!' అంటే 'పాప్పు శారు జేశా' అని చెప్పింది. అత్త ఆశ్చర్యపోయింది. ఈ ఏడంతా కోడలు కూడొండుకొంటే కూర చేసుకోలేదు. కూర చేసుకొంటే కూడొండుకోలేదు. అసలు పొయ్యే ముట్టించకుండా చాలా రోజులు గడిచిపోయాయి.

అత్త అన్నం తెచ్చిపెట్టేది. కలిపి తినిపించేది. తింటుంటే ఆత్మీయంగా చూచుకొనేది. ఆరోజు రాత్రి కొడుకు మావయ్య ఇంటికి వస్తాడన్న ముక్క అత్త వింది.

కోడల్ని ముందు కూర్చోబెట్టుకొని, తల విప్పింది. 'మాతే, యాందే బాగుండావా?' అని ప్రశ్నించింది. తల పాయలు తీసింది. 'ఈరుప్పనెఇటియ్యి' అని తీసుకుంది. 'సిక్కు దీయాలె!' అనీ అంది. ' వొట్టి సేతుల్తో', అంది అత్త. 'అట్టాగే' అంది కోడలు.

అత్తకు ఆనందంగా ఉంది.రెండేళ్ళు జయిల్లో ఉండి వచ్చిన కోడలు. ఈ సంవత్సరంలో ఇంత ఆనందంగా ఎప్పుడూ లేదు. మనిషి మామూలు మనిషి అవుతుందని, మనుష్యుల్లో కలిసిపోతుందని, ఆశపడింది. కొడుకు కోడలు మళ్ళీ ఒకటవుతారని అనిపించింది. ఆశకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. అత్తకు అంతులేని పరవశం.

మాతమ్మకు మరణదండనే పడుతుందని అందరూ భావించారు. హత్యకు, బుద్ధి పూర్వకంగా చేసిన హత్యకు, మరణదండనే  ఖాయమని  అందరూ నమ్మారు. యావజ్జీవ కారాగారశిక్ష కూడా చిన్నదే! మరణమే ఖాయం. మరణశిక్ష ఖాయం. 'మాతమ్మ మనలోకి రాదు. మళ్ళీ మణిసి కాదు ' అనుకొన్నారు అందరూ.

రాముడు, తల్లిదండ్రులు, అత్తామామలు, అందరూ కలిసి మాతమ్మను బతికించుకోవడానికి జిల్లా కోర్టు నుంచి, హైకోర్టు దాకా కేసు నడిపారు.హైకోర్టులో ప్రఖ్యాత న్యాయమూర్తి తీర్పు చదివిన రోజు న్యాయశాస్త్రం ఆశ్చర్యంగా నిలబడిపోయింది. సంచలనం సృష్టించిన ఆ తీర్పు, న్యాయశాస్త్ర దృష్టితో అది అతి నూత్నమైన విలువను ప్రతిపాదించింది.

మాతమ్మ హత్యలు చేసినట్లు కోర్టు అంగీకరించింది. ఆ హత్యల వెనుక ఉన్న ఆర్థిక కారణాలను, దారిద్ర్య కారణాలను భగ్నమైన ప్రేమ, పెంచుకొన్న విశ్వాసం గతి తప్పటానికున్న కారణాలను చంపాలి కాని, హత్య చేసిన మనిషిని కాదని తీర్పు తలపోసింది.

దాంపత్యంలో స్త్రీకి ఉన్న అభద్రతా భావం అరక్షణభావం తొలగించకుండా, మాతమ్మను తొలగించటం న్యాయం కాదని తీర్పు భావించింది. మమకారానికి, భర్త ప్రేమకూ మధ్య సంఘర్షణలో, స్త్రీ పురుష సంబంధాలలో విపర్యయాలు తలెత్తుతున్నంత కాలం, వ్యక్తిత్వానికి, మానసిక అస్వస్థతకు మధ్య సంఘర్షణ సాగించే సాంఘిక దురన్యాయం దొర్లుతున్నంత కాలం, పురుషుడికి ఉన్న స్వేచ్ఛ, స్త్రీకి లేని స్వేచ్ఛ, నీతిగా చెలామణి అవుతున్నంత కాలం, మాతమ్మ నేరం నేరం కాదు.

ఏ సంఘం హత్యలకు కారణమో, ఆ సంఘాన్ని శిక్షింపకుండా ఒక్క మనిషిని శిక్షించడం పాశవికం.

ఏ శిక్షా స్మృతి ప్రకారం కూడా మాతమ్మను శిక్షించే అవకాశం లేదు.

రెండేళ్ళు జైలులో గడిపిన కాలం శిక్షాకాలంగా చాలు. ఇక జైలు శిక్షగానీ, మరణశిక్ష గానీ అక్కరలేదు.

తీర్పు మాతమ్మకు విడుదల ప్రసాదించింది. కానీ, ఆ తీర్పు అంతటితో ఆగలేదు.

మాతమ్మకు భర్త యావజ్జీవన మనోవర్తి ఇవ్వాలి.

రోజుకు రెండు సార్లు ఆమె బావి చుట్టూ ఊడ్చాలి. ఆమె రోజుకు రెండు సార్లు బావి చుట్టూ శుభ్రం చేయాలి.

ఆ శిక్ష ఒక్క సంవత్సరమే. ఈ రోజుతో ఏడాది పూర్తవుతుంది.

మాతమ్మ హత్యలకు బావి సాక్షి. బావి దగ్గర రోజుకు రెండు సార్లు శిక్ష ఊడిపిస్తుంది రోజూ రెండు సార్లు శిక్ష. గతం, పాపం, హత్యలు గుర్తుకు వచ్చి మాతమ్మ కుమిలిపోతే అది శిక్షే! క్షాళనం అయితే మేలే ఆమె తను హత్యలు చేసిన బావి దగ్గర గుడిసెలో ఒంటరిగా కాపురం ఉండాలి. బావిని చూస్తూ ఉండాలి. శిక్ష గుర్తుకు వస్తూ ఉండాలి.

తెల్లవారితే శిక్షా కాలం పూర్తవుతుంది.

మాతమ్మ చీపురు తీసుకొని బావి దగ్గరకు వచ్చింది. చప్టా ఎక్కింది. బావిలోకి తొంగి చూసింది. గాలి అందగత్తె కురులు నిమిరినట్లు బావిలో నీరు కదలాడుతూ ఉంది. బావిలో

నీళ్ళు కదులుతుంటే కళ్ళలో నీళ్ళు కదులుతున్నాయి.

తల దువ్వుకొని, పూలు పెట్టుకొని, బొట్టూ కాటుక పెట్టుకొని ఉల్లాసంగా ఉన్న మాతమ్మ ఆనందం నీరుగారిపోతుందనుకొంటే భ్రమే! కళ్ళలో నీళ్ళు తిరిగిన మాట నిజం. అది దుఃఖమో, ఆనందమో, తేల్చి చెప్పటానికి వీలు లేదు.

బావి చుట్టూ ఊడ్చింది వెట్టి వచ్చాడు. రోజూ శిక్ష అమలు జరిగినట్లు మునసబుకు సమాచారం అందించవలసిన వెట్టి. 'రేపటితో నీ సిచ్చ తీరిపోద్దే' అన్నాడు. ఆమె మాట్లాడలేదు. 'రేప్పొద్దున్నే నువ్వొచ్చి ఊడ్చేపనిలే' అన్నాడు ఆమె మాట్లాడలేదు.

ఆకులూ, అలములూ, గడ్డీగాదం ఊడ్చి దూరంగా పారేసింది. నీళ్ళు తోడి చప్టా మీద పోసి, బావికి దాని నీళ్ళతోనే మాతమ్మ స్నానం చేయించింది. సూర్యుడు పడమట ప్రయాణంలో బడలిక తీర్చుకోవటానికి కొండల వెనక్కుపోయి పడుకొన్నాడు. సంజె వెలుతురు చిన్న చిన్న పొలం పనులకు పోయిన పల్లెవాళ్ళు నెమ్మదిగా ఇళ్ళకు చేరుకొంటున్నారు. అప్పుడొకరు, ఇప్పుడొకరు బావి నీళ్ళకు వస్తున్నారు.

ఈ ఏడంతా రాముడు తిండి గింజలు తెచ్చి పెడుతూనే ఉన్నాడు. కూరగాయలు తెచ్చి ఇస్తున్నాడు. కొత్త బట్టలు కూడా కొని తెచ్చాడు. రాముడు మనోవర్తికి లోపం చేయలేదు.

మాతమ్మ ఎప్పుడైనా బుద్ధిపుడితే వండుకు తినేది. అత్త పెడితే కాదనలేదు. లేకపోతే పస్తే! కొత్త బట్టలు మాత్రం కట్టుకోలేదు.

కానీ, ఆరోజు మాత్రం అలాగాదు. పెళ్ళినాట, శోభనం నాట పట్టు చీర కట్టుకొంది. పూలు పెట్టుకొంది. అన్నం కూర అన్నీ సిద్ధం చేసింది. సంసిద్ధంగా ఉంది.

రాముడు ఇంటికి రాగానే తలుపు తీసింది. లోపలికి రాగానే తలుపు వేసింది. ఇంట్లో బుడ్డి వెలుగుతూనే ఉంది. పల్లె సద్దుమణిగింది. వీధుల్లో కదలిక లేదు. మనుష్యులు నడిచిన అలికిడి లేదు. కుక్కల తిరుగుళ్ళు, అరుపులు, పల్లెను జోకొడుతున్నాయి. పల్లె చీకట్లోకి జారుకొంటూ ఉంది. ఇళ్ళలో బుడ్డి వెలుతురులు ఒక్కొక్కటే పెద్దవవుతూ రాసాగాయి. మాతమ్మ పూరింట్లో దీపం కొండెక్కింది. పల్లె చీకటి ముద్దలాగా అయిపోయింది. ఇంట్లో శబ్దం లేదు.

మూడేళ్ళ క్రితం, ఇటువంటి రాత్రి మాతమ్మ భర్తతో తగవు పెట్టుకొంది. 'బోగందాన్ని వదిలెయ్' అంది. ' వీలుగాదు' అన్నాడు. ఆ రాత్రంతా గొడవ. తిట్లు, పోట్లాట, కొట్లాట,

రాముడు విసిగిపోయాడు. ఓర్పుచచ్చిపోయింది. మాతమ్మకు పౌరుషం. రోషం, కోపం.... అందరికీ ఆమె తిక్కది. మాతమ్మకు మంట పుడుతూ ఉంది. భర్తను తిట్టింది. లాగులాడింది. పీకులాడింది. పైన పడి రక్కింది. ఎంతో సేపు ఓర్పు పట్టిన రాముడు తిక్కబట్టి తన్నాడు. తన్నిన కొద్దీ రెచ్చిపోయింది. కలబడింది. నెట్టేస్తే వాటేసుకొంది. దూరంగా తోస్తే గాలి తోలినట్లు వచ్చి చుట్టేసుకొంది. భర్త భార్య అలజడికి తట్టుకోలేక ఒంటికి పోయే నెపంతో బయటికి పోయాడు.

మాతమ్మ ఊగిపోతూ ఉంది. నిలబడలేకుండా ఉంది. ఆగలేకపోయింది. 'సస్తా' అంది. కొడుకు, కూతురు నిద్రపోతున్నారు. పసిదాన్ని తీసి భుజానేసుకొంది. కొడుకును లేపి చేయి పట్టుకొంది. వాడు చేయి వాటేసుకుని నిద్దట్లో నిలబడ్డాడు.

మాతమ్మ తలుపు తోసింది, 'సత్తాం' అంది. ఇంకా రాముడు ఇంట్లోకి రాలేదు. మాతమ్మ పిల్లలతో వీధిలోకి వచ్చింది.

భార్య బావి దగ్గరకు వచ్చినప్పుడు భర్త ఇంట్లోకి వచ్చాడు. తచ్చాడాడు. భార్యా పిల్లల కోసం తడిమాడు. లేనట్లనిపించింది. 'మాతే' అన్నాడు. జవాబు లేదు. 'వొసే మాగ్దానా' పిలిచాడు. బదులు పలకలేదు. 'యాడ జచ్చా?' అడిగాడు.

మాతమ్మ బావి దగ్గరుంది. రాముడు ఇంటి వెలుపలికి వచ్చాడు. బావి దగ్గర అలికిడి. నీడలు. 'మేం జత్తాం' మాతమ్మ చెప్పింది. పిల్లవాణ్ణి ఎత్తి బావిలోకి వదలబోయింది. వాడు మరో చేత్తో ఆమె చేయి పట్టుకొన్నాడు. ఇంకా నిద్దట్లోనే వున్నాడు. గొంగళి పురుగును విదిలించినట్లు విదిలించింది. ఆమె చేయి వదిలించుకొంది. వాడి చేయి జారిపోయింది నీట్లో దబ్బున శబ్దం.

వాకిట్లోకి వచ్చిన రాముడు శబ్దం విన్నాడు. 'యేందే?' అన్నాడు. 'యేంజేత్తన్నా?' అన్నాడు 'సత్తన్నా' అంది.

భుజం మీద వున్న కూతుర్ని చేతుల్లోకి లాగబోయింది. పిల్ల తల్లి జాకెట్టు వీపు మీద పట్టుకొంది. ఊడబీకినా రాలేదు. విసిరి లాగింది. పిల్ల కెవ్వుమంది.

పరుగెత్తుతున్న రాముడు 'మాతే ఆగే' అంటూనే ఉన్నాడు. ముట్టుబట్టను పారేసినట్లు ఆడపిల్లని బావిలోని నీళ్ళోకి విసిరిపారేసింది. నీరు లబోమంది. మరుక్షణం బావి పిట్టగోడ ఎక్కింది. గిలక తప్పించుకొంది. దూకబోతున్నప్పుడు రాముడు వచ్చి పూలు పట్టుకొన్నాడు. ముడిపట్టుకొన్నాడు. జుట్టు పట్టుకున్నాడు. నడుం వాటేసుకున్నాడు. కిందికి లాగాడు.

మాతమ్మ చప్టామీద పడింది. కూలబడింది. లేచింది. పెనుగులాడింది. మొగుణ్ణి చేతులతో కొట్టింది. కాళ్ళతో తన్నింది. విడిపించుకోజూసింది. రాముడు భార్యను వదల్లేదు. 'నన్నొదులు. నన్ను చావనీ, నన్నొదులు' అరుస్తూనే ఉంది. గోల. రద్దీ, రాముడడ్డం పడితే మాతమ్మ ఆరాటపడింది. చావుకు తన్నుకులాడింది. వదిలించుకోవటానికి పీకులాడి చచ్చింది.

కుక్కలు అరవటం మొదలుపెట్టాయి. బావి దగ్గర గోల చుట్టు పక్కల ఇళ్ళ వాళ్ళు విన్నారు. బైటికి వచ్చారు. రాముడు అరుస్తూ ఉన్నాడు. గోలబెడుతున్నాడు. ఏడుస్తున్నాడు.

ముసలీముతక నిద్ర పట్టక గోలకు లేచి వచ్చారు. వాళ్ళూ వీళ్ళూ వస్తున్నారు. బావి చుట్టూ గందరగోళం, ఎవరు చెప్పింది ఎవరికీ వినబడటం లేదు.

మాతమ్మ పిల్లల్ని బావిలో పడేసి దూకబోతుంటే భర్త ఆపాడని, పిల్లలు నీళ్ళలో మునుగుతున్నారనీ, అందరికీ అర్థమయింది.

బావిలోకి దూకే మనిషి కావాలి. రాముడు దూకబోయాడు. అందరూ ఆపారు. రాముడికి ఈతరాదు. ఇటువంటి బావిలో గజీతగాళ్ళకే కష్టం.

బావి బలిగోరింది. ఈత వచ్చిన వాళ్ళు కూడా తటపటాయిస్తున్నారు. రాముడు బావిలోకి దిగుతానన్నాడు. చిమ్మ చీకటి. వాడికి జలగండం. ఊర జెరువులో గొడ్ల కోసం దిగి చావవలసిన వాడు. తాత బతికొస్తే బట్ట కడుతున్నాడు.

తెల్లవారిందాకా ఎవరూ బావిలోకి దిగలేదు. పిల్లల శవాలను చప్టా మీద పడుకోబెట్టారు. మాతమ్మను రాముడు వదల్లేదు. జనం రాముణ్ణి వదల్లేదు. వెట్టి వచ్చాడు. కూడా మోతాదు వచ్చాడు. మునసబు కరణం వచ్చారు. పోలీసు కేసు అయింది. పోలీసులు మాతమ్మను పట్టుకుపోయి జైల్లో పెట్టినప్పుడు, బావిలో దూకి చస్తుందనే భయం రాముణ్ణి వదిలిపెట్టింది.

భావి చుట్టూ ఊడ్చే శిక్ష పడ్డ మాతమ్మ ఏ రోజు అయినా బావిలో శవంగా తేలుతుందని జనం అనుకొన్నారు వాళ్ళు అనుకొన్నట్లు జరగలేదు. మనిషి కోలుకొంది. మామూలు మనిషి అవుతూ ఉంది. తెల్లవారితే శిక్ష ముగుస్తుంది. ఆ రాత్రి భర్త కోసం ఎదురు చూచి, ఆహ్వానించి, తలుపు వేసుకొన్న భార్యను చూచిన భర్త ఇది మామూలు మణిసయింది' అనుకొన్నాడు.

ఆ రాత్రి మాతమ్మ మైమరచిపోయింది. కరిగింది. పరవశించింది నీరసించింది. అయినా అంది. ' పిల్లోల్ళు గేపకానికి వస్తున్నారు' అంది. 'రానీ!' అన్నాడు 'నాకు పిల్లోళ్ళు లేరు' అంది. ఏడుస్తూంది 'యాడవ బాకే' పిల్లోళ్ళు పుడతారులే, నీకేం వయస్సు తక్కువా, కనీ పెంచే వయస్సే, 'పుడతార్లే' అన్నాడు. భర్త ఉత్సాహంగా ఉన్నాడు.

మాతమ్మ తలుపు దీసింది. ఏడుస్తూ ఉంది. 'యాడకే!' అన్నాడు. 'యాడవబాకే' అనీ అన్నాడు. 'పిల్లోళ్ళు' అంది. ' గురుతుకొత్తన్నారు' అనీ అంది. 'యాడకే' అంటే 'బాయికాడికి' అంది ' యెందుకే?' అంటే 'పిల్లోళ్ళని జూత్తా' అంది.చస్తుందేమో అనుకొన్నాడు భర్త. వెంట నడిచాడు, మాతమ్మ బావిలోకి తొంగి చూచింది. 'పిల్లలు బిలుత్తున్నారు అంది. ' నీ మొకం' అన్నాడు. బావి శూన్యంగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. చిమ్మ చీకటి. అలికిడి లేదు.

"పిల్లోళ్ళ బిలుత్తున్నారయ్యా'అంటే 'సాల్ సాల్లే' అన్నాడు. 'సూడయ్య' అని చూపించింది. 'చా. ఊరుకో' అన్నాడు. భార్యను వాటేసుకొన్నాడు. భర్తను వాటేసుకొని ఏడుస్తూ ఉంది. 'మన పిల్లోళ్ళు' అంది. 'సచ్చిపోయేరు' అంది. ' పోన్లే!' అని ఓదార్చాడు.

తొంగి చూచింది. వాటేసుకొని ఉండటం వల్ల భర్త కూడా తొంగి చూడకతప్పలేదు! ఒకర్నొకరు గట్టిగా నడుముల దగ్గర పట్టుకొని ఉన్నారు. ఇద్దరూ బావి అర్ధగోడకు అనుకొని ఉన్నారు. మాతమ్మ ముందుకు చూచింది. భర్త కూడా వంగాడు. మాతమ్మ కాళ్ళు జారాయి. అర్ధగోడ మీదకు తేలిపోయింది. భర్తకు పట్టు తప్పింది. భార్యను వదల్లేదు. ఆమె భర్తను వదల్లేదు. ఇద్దరికీ తూలు వచ్చింది. ఇద్దరూ ముందుకు వంగారు. తూలారు. బావిలో రాళ్ళు పడ్డట్లు ' లబోదిబో' మని శబ్దం.

★